అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి


పార్కు పనులను పరిశీలిస్తున్న కమిషనర్ ప్రవీణ్‌చంద్

కడప కార్పొరేషన్ : కడప నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్ ఎస్ఎస్ ప్రవీణ్‌చంద్ ఆదేశించారు. మంగళవారం ఆయన జువైనల్ హోం, దిశ పోలీస్‌స్టేషన్, ఎస్ఎఫ్ఎస్ స్ట్రీట్, భగత్ సింగ్‌నగర్, రాజీవ్ మార్గ్, ఎన్‌జీఓ కాలనీల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ జువైనల్ హోంలో ఫ్యాన్లు అన్నీ పనిచేసేలా చూసుకోవాలని, మరుగుదొడ్లలో ఎగ్జాస్టర్ ఫ్యాన్లను ఏర్పాటు చేయాలన్నారు. పలు రకాల ఆకుకూరలు, కూరగాయలతో కిచెన్ గార్డెన్ ఏర్పాటు చేసుకోవాలన్నారు. దిశ పోలీస్‌స్టేషన్ వద్ద నిర్మిస్తున్న మరుగుదొడ్ల నిర్మాణం వేగవంతం చేయాలని, ఎస్ఎఫ్ఎస్ వీధిలో నిర్మిస్తున్న మురికి కాలువలను శుభ్రం శుభ్రం చేయాలన్నారు. భగత్ సింగ్ నగర్ వద్ద జరుగుతున్న పార్కు నిర్మాణ పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. ఎన్‌జీవో కాలనీ వద్ద నిర్మిస్తున్న అర్బన్ హెల్త్ సెంటర్ నిర్మాణ పనులను తక్షణమే పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నగరపాలక డీఈఈలు రాజేష్, వేణుగోపాల్, ఏఈ అంజలికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

భూగర్భ డ్రైనేజీ వ్యవస్థను సరిచేయాలి

కడప నగరంలోని నిజాం నగర్‌లో భూగర్భ డ్రైనేజీ వ్యవస్థను సరిచేయాలని మున్సిపల్ కమిషనర్ ఎస్ఎస్ ప్రవీణ్‌చంద్ ఆదేశించారు. మంగళవారం మార్నింగ్ విజిట్‌లో భాగంగా 3,11,14 డివిజన్లలో పర్యటించి పారిశుధ్య కార్మికుల హాజరుపట్టికలను పరిశీలించారు. నిజాంనగర్లో బ్లాక్ అయిన మ్యాన్ హోళ్లను గుర్తించి మరమ్మతులు చేయాలన్నారు. బహుజననగర్లో మెయిన్ రోడ్డులో వాటర్‌పైపులైన్ లీకేజీకి మరమ్మతులు చేయాలన్నారు. ఆటోనగర్‌లో రోడ్లు, కాలువలు, కల్వర్టు నిర్మించడానికి అంచనాలు సిద్ధం చేయాలని ఆదేశించారు. స్కూల్‌కు ప్రహరీ నిర్మించాలని, పిల్లలు నడవడానికి దారి ఏర్పాటు చేయాలన్నారు. విద్యార్థులు ఆడుకోవడానికి ఆట పరికరాలు ఏర్పాటు చేయాలని, నిరుపయోగంగా ఉన్న బోర్‌కు మరమ్మతులు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో 3వ డివిజన్ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి సుదర్శన్‌రెడ్డి, ఎంహెచ్‌ఓ ప్రశాంత్‌వర్ధన్, డీఈఈ కరిముల్లాఖాన్, వార్డు ఎమినిటీస్ సెక్రటరీ ప్రియాంక పాల్గొన్నారు.

జేవీవీ చెకుముకి పోస్టర్ల ఆవిష్కరణ


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న చంద్ర ఓబుల్‌రెడ్డి, జేవీవీ ప్రతినిధులు

కడప కల్చరల్ : జన విజ్ఞాన వేదిక చెకుముకి రాష్ట్ర స్థాయి సైన్స్ సంబరాల పోస్టర్లను మంగళవారం కందుల గ్రూప్ విద్యా సంస్థల చైర్మన్ చంద్ర ఓబుల్ రెడ్డి ఆవిష్కరించారు. ఈనెల 21, 22 తేదీల్లో కడప నగరంలో జరగనున్న చెకుముకి రాష్ట్ర స్థాయి సైన్స్ సంబరాల వివరాలను ఈ పోస్టర్‌లో ప్రచురించారు. ఈ సందర్భంగా చంద్ర ఓబుల్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల్లో శాస్త్రీయ జ్ఞానాన్ని పెంచేందుకు జేవీవీ చేస్తున్న కృషి ప్రశంసనీయమన్నారు. రాష్ట్ర అధ్యక్షులు రాజశేఖర రాహుల్ మాట్లాడుతూ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలకు అవగాహన కల్పించేందుకు, విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని ప్రోత్సహించేందుకు జేవీవీ ఈ సంబరాలను నిర్వహిస్తోందన్నారు. ప్రధానంగా యువతను లక్ష్యంగా చేసుకుని వారిలో శాస్త్రీయ విజ్ఞానాన్ని పెంపొందిస్తే సమాజంలో ఆలోచన పరులుగా సరైన జ్ఞానంతో పెరుగుతాయన్నారు. తమ సంస్థ ప్రతి ఏడాది చెకుముకి సైన్స్ ఫెస్టివల్ పేరిట మెగా సైన్స్ ఈవెంట్‌ను పాఠశాల, మండలం, జిల్లా స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు నిర్వహిస్తోందని, ఇందులో సైన్స్ జ్ఞానాన్ని పెంచేందుకు క్విజ్‌లు, పరీక్షలు, ప్రయోగాలుసహా అనేక వినోదాత్మక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆహ్వాన కమిటీ ప్రధాన కార్యదర్శి వెంకట సుబ్బయ్య, కందుల రాజేశ్వరమ్మ, జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు, ప్రతినిధులు సరస్వతి, సునీత, కామేశ్వరమ్మ, ప్రేమ్ తదితరులు పాల్గొన్నారు.

విజయదుర్గాలయంలో రాహుకాల పూజలు


విశేష అలంకారంలో శ్రీ విజయదుర్గమ్మ

కడప కల్చరల్ : కడప నగరంలోని శ్రీ విజయదుర్గాదేవి ఆలయంలో మంగళవారం మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై రాహుకాల పూజలు నిర్వహించారు. అమ్మవారి సన్నిధిలో ఈ పూజలు నిర్వహిస్తే రాహుకేతువు గ్రహ ప్రభావంతో ఏర్పడే బాధలు తొలగిపోతాయన్న విశ్వాసంతో జిల్లా నలుమూలల నుంచి భక్తులు విశేష సంఖ్యలో ఈ పూజలకు హాజరయ్యారు. ఆలయ ప్రధాన అర్చకులు భక్తులకు పూజా విధానాన్ని వివరిస్తూ కార్యక్రమం నిర్వహింపజేశారు. ఆలయ వ్యవస్థాపకులు సుధా మల్లికార్జునరావు, నిర్వాహకులు దుర్గాప్రసాద్‌భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.


రాహుకాల పూజలు నిర్వహిస్తున్న భక్తులు

క్లుప్తంగా

మేయర్‌కు పరామర్శ


మేయర్ కె. సురేష్ బాబుతో మాట్లాడుతున్న ఆర్టీసీ చైర్మన్ మల్లికార్జునరెడ్డి

కడప కార్పొరేషన్ : వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు, కడప మేయర్ కె. సురేష్ బాబును ఏపీఎస్‌ఆర్‌టీసీ చైర్మన్ ఏ. మల్లికార్జునరెడ్డి పరామర్శించారు. హైదరాబాద్‌లో చికిత్స పొంది ఇటీవల కడపలోని తన నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్న మేయర్‌ను సోమవారం ఆయన కలిసి ఆరోగ్య పరిస్థితిని ఆరా తీశారు. త్వరగా కోలుకొని మళ్లీ పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలని మల్లికార్జునరెడ్డి ఆకాంక్షించారు.

ఆర్టీసీ చైర్మన్‌ను కలిసిన అనకాపల్లి ఎంపీ

కడప కోటిరెడ్డిసర్కిల్ : అనకాపల్లిలో ఈనెల 22న జరగనున్న తన కుమారుడి వివాహానికి రావాలని అనకాపల్లి ఎంపీ వెంకట సత్యవతి, ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్ అబ్బిరెడ్డి మల్లికార్జునరెడ్డిని కోరారు. మంగళవారం ఆమె కుటుంబ సభ్యులతో కలిసి కడపలోని ఆర్టీసీ చైర్మన్‌ను ఆయన క్యాంపు కార్యాలయంలో కలిసి వివాహ పత్రికను అందజేశారు.

టైలరింగ్, బ్యూటీపార్లర్‌లో ఉచిత శిక్షణ

కడప కార్పొరేషన్ : కెనరా బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో టైలరింగ్, బ్యూటీపార్లర్ మేనేజ్‌మెంట్, ఎంబ్రాయిడరీ, ఫ్యాబ్రిక్ పెయింటింగ్ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ ఎస్. నారాయణరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 18–45 ఏళ్లలోపు ఉన్న గ్రామీణ ప్రాంత నిరుద్యోగ మహిళలు ఈ శిక్షణకు అర్హులని పేర్కొన్నారు. 30 రోజులపాటు సాగే ఈ శిక్షణ ఈనెల 23వ తేది నుంచి ప్రారంభం కానుందన్నారు. వివరాలకు 9440905478, 6302833546 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

నేడు నమూనా కానిస్టేబుల్ పరీక్ష

ప్రొద్దుటూరు : డీవైఎఫ్‌ఐ ఆధ్వర్యంలో నమూనా కానిస్టేబుల్ పరీక్షను జిల్లా వ్యాప్తంగా బుధవారం మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు నిర్వహించనున్నట్లు డీవైఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు డేవిడ్ రాజ్ తెలిపారు. మంగళవారం ఆయన స్థానిక డీవైఎఫ్‌ఐ కార్యాలయంలో మాట్లాడుతూ ఈ పరీక్షను కేఎస్ లక్ష్మణరావు సారథ్యంలో నిర్వహించనున్నట్లు చెప్పారు. కడపలో ఎస్‌వీ డిగ్రీకాలేజీ, ప్రొద్దుటూరులో సృజన్ కోచింగ్ సెంటర్‌లో, మైదుకూరులో మేధా డిఫెన్స్ అకాడమిలో, జమ్మలమడుగులో ఎస్‌పీ డిగ్రీ కాలేజీలో, పోరుమామిళ్లలో వర్ష కోచింగ్ సెంటర్‌లో నమూనా పరీక్షలు నిర్వహిస్తామని వివరించారు. అభ్యర్థులు తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్‌ఐ నాయకులు సురేష్, సుందరయ్య పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్ ఇంజినీరింగ్ అభివృద్ధి పనులకు భూమి పూజ

ప్రొద్దుటూరు : స్థానిక కొర్రపాడు రోడ్డులోని వైఎస్సార్ ఇంజినీరింగ్‌కాలేజీలో అభివృద్ధి పనులకు బుధవారం ఉదయం 10 గంటలకు ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి భూమి పూజ చేయనున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లె లక్ష్మీదేవి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని ఆమె కోరారు.

వర్గీకరణకు సహకరించండి


బీజేపీ జిల్లా అధ్యక్షుడు యల్లారెడ్డికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ప్రొద్దుటూరు : ఎస్సీ వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత కల్పించాలని కోరుతూ బీజేపీ జిల్లా అధ్యక్షుడు యల్లారెడ్డికి మంగళవారం ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ నాయకులు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీ మాదిగలకు ఇచ్చిన మాటను 8 ఏళ్లు గడిచినా నిలబెట్టుకోలేదని తెలిపారు. ఈ విషయాన్ని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులుతో మాట్లాడి కేంద్రం దృష్టికి తీసుకెళ్లాలని యల్లారెడ్డిని రారు. ఈ సమస్యపై స్పందించకపోతే ఈనెల 24వ తేదీ నుంచి రాష్ట్రంలోని బీజేపీ రాష్ట్ర నాయకులు, జిల్లా, నియోజకవర్గ నాయకుల ఇళ్లను మందకృష్ణ మాదిగ నాయకత్వంలో ముట్టడిస్తామని హెచ్చరించారు. ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ నాయకులు ఇ.శివశంకర్ మాదిగ, వై.వెంకటరమణ, దాసరి ఓబులేసు, గద్దం నరసింహులు పాల్గొన్నారు.

రేషన్‌బియ్యం పట్టివేత

నిందితుడు అరెస్ట్

కడప అర్బన్: కడప నగర శివార్లలోని రామాంజనేయపురం సమీపంలో సుమోలో అక్రమంగా తరలిస్తున్న ప్రభుత్వ రేషన్ బియ్యం బస్తాలను ఎస్‌ఐ నారాయణ తమ సిబ్బందితో కలిసి మంగళవారం సాయంత్రం పట్టుకున్నారు. ఈ సంఘటనలో ఇందిరానగర్‌కు చెందిన చాంద్‌బాషాను అరెస్ట్ చేయడంతో పాటు 1618 కిలోల బరువున్న 34 బస్తాల ప్రభుత్వ రేషన్ బియ్యాన్ని సీజ్ చేశారు.

ఆర్‌జేడీ వెంకట కృష్ణారెడ్డికి వీడ్కోలు

కడప ఎడ్యుకేషన్: పాఠశాల విద్య కడప ప్రాంతీయ సంయుక్త సంచాలకులుగా పనిచేస్తూ ఏపీ మోడల్ స్కూల్ జాయింట్ డైరెక్టర్ బదిలీపై వెళుతున్న మార్తాల వెంకట కృష్ణారెడ్డిని మంగళవారం సాయంత్రం కడపలో పీఆర్‌టీయూ రాష్ట్ర క్రమశిక్షణ సంఘం చైర్మెన్ కొండూరు శ్రీనివాసురాజు, సంబేపల్లి హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు మడితాటి నరసింహారెడ్డి, పీఆర్‌టీయూ సంఘం ఉపాధ్యాయ బృందం ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. ఆర్‌జేడీగా ఆయన చేసిన సేవలను కొనియాడారు. అలాగే నూతనంగా ఆర్‌జేడీగా(ఎఫ్ఏసీ) బాధ్యతలు చేపట్టిన బండ్లపల్లె ప్రతాప్‌రెడ్డి మర్యాద పూర్వకంగా కలిసి స్వాగతం పలికారు. రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు ఏబీ రామక్రిష్ణమరాజు, జిల్లా అసోసియేట్ అధ్యక్షులు కురాకు రవీంద్ర, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ నాయకులు....

ఆర్‌జేడీగా బాధ్యతలు చేపట్టిన బండ్లపల్లె ప్రతాప్‌రెడ్డికి ఏపీటీఎఫ్ నాయకులు ఘనంగా శుభాకాంక్షలు తెలిపారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్యాసుందర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, రాష్ట్ర కౌన్సిలర్లు తెలిపారు.

ఘనంగా సత్కరించిన ఆర్‌జేడీ కార్యాలయ ఉద్యోగులు...

ఆర్‌జేడీగా బాధ్యతలు చేపట్టిన బండ్లపల్లె ప్రతాప్‌రెడ్డికి ఆర్‌జేడీ కార్యాలయ ఏడీపీ, సూపరెండెంటెంట్లు, సీనియర్ అసిస్టెంట్లు, జూనియర్ అసిస్టెంట్లు ఘనంగా సత్కరించారు.

రేపు త్యాగరాజస్వామి గ్రామోత్సవం

ప్రొద్దుటూరు కల్చరల్ : మండలంలోని కానపల్లె గ్రామంలో గురువారం సాయంత్రం 3 నుంచి 6 గంటల వరకు శ్రీవీరాంజనేయస్వామి ఆలయంలో నుంచి శ్రీలక్ష్మీవెంకటేశ్వరస్వామి ఆలయం వరకు శ్రీసద్గురు త్యాగరస్వామి గ్రామోత్సవం నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

కలసపాడు : మండలంలోని ఎగువతంబళ్లపల్లె గ్రామంలో ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు ఎగువరామాపురం బ్రాంచ్ వారి ఆధ్వర్యంలో మంగళవారం కె.ఎస్.రూరల్ మీడియా కళాజాతర బృందం వారి చేత ప్రజలకు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా బ్యాంకు మేనేజర్ బి.వినోద్‌కుమార్ మాట్లాడుతూ బ్యాంకు ద్వారా అందుబాటులో ఉన్న సేవలు, మొబైల్ బ్యాంకింగ్, ఇంటర్నెట్ బ్యాంకింగ్, ఏటీఎం, మెసేజ్ అలర్ట్ వంటి అధునాతన సేవల గురించి వివరించి వాటిని వినియోగించుకోవాలని తెలిపారు.

రోగులకు మెరుగైన వైద్యం అందించాలి

గోపవరం : వివిధ వ్యాధులతో ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించాలని అడిషనల్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఖాదర్‌వల్లి, ట్రైనీ కలెక్టర్ రాహుల్‌మీనలు తెలిపారు. మంగళవారం మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని అడిషనల్ డీఎంహెచ్‌ఓ, ట్రైనీ కలెక్టర్ వేరువేరుగా తనిఖీలు నిర్వహించారు. నాడు–నేడు పథకం ద్వారా ఆసుపత్రి అభివృద్ధి పనులు, మౌలిక వసతులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటూ ఆసుపత్రికి వచ్చే రోగులకు అవసరమైన వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేయాలన్నారు. ఆసుపత్రిలో వైద్యులు, సిబ్బంది లేరు అన్న సమస్య రాకూడదన్నారు. అన్నిరకాల మందులు అందుబాటులో ఉన్నాయన్నారు. వైద్యులతో పాటు ఆసుపత్రిలో పనిచేసే సిబ్బంది వారి వివరాలను వైద్యాధికారి డాక్టర్ నర్మదను అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది, ఓపీ, మెడిసిన్‌కు సంబంధించిన రిజిస్టర్లను తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఆసుపత్రి పరిసరాలను పరిశీలించి పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఈ తనిఖీల్లో డాక్టర్ వెంకటరత్నాలు, సూపర్‌వైజర్ శివరామిరెడ్డి, సీహెచ్‌ఓ గౌస్ ఉన్నారు.

రైతు సమస్యలపై ఉద్యమించిన నేత చెన్నకృష్ణారెడ్డి

పోరుమామిళ్ల : రైతు సమస్యలపై నియోజకవర్గంలో అనేక గ్రామాలు పర్యటించి రైతుల్లో చైతన్యం నింపేందుకు కృషి చేయడంతో పాటు వ్యవసాయ కార్మికుల సమస్యలపై పోరాటాలు నిర్వహించిన నాయకుడు చెన్నకృష్ణారెడ్డి అని పలువురు నాయకులు పేర్కొన్నారు. మంగళవారం పోరుమామిళ్లలో కమ్యూనిస్టు నేత చెన్నకృష్ణారెడ్డి వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.

లింగాలదిన్నెపల్లెలో పార్వేట ఉత్సవం



బ్రహ్మంగారిమఠం : మండలంలోని లింగాలదినెన్నపల్లెలో మంగళవారం సాయంత్రం సంక్రాంతి సంబరాల్లో భాగంగా ఘనంగా పార్వేట ఉత్సవం నిర్వహించారు. రామాలయంలో ఉదయం ప్రత్యేక పూజలు చేశారు. సీతారాముల చిత్రపటాన్ని ట్రాక్టర్‌లో ఉంచి ఊరేగింపుగా బి.మఠం క్రాసింగ్ వరకు తీసుకెళ్లి పార్వేట ఉత్సవం నిర్వహించారు. అనంతరం గ్రామోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారుల కోలాటం అందరిని ఆకట్టుకుంది.

సంక్రాంతి విజేతలకు బహుమతులు పంపిణీ


పాత కడపలో అల్లెంగుండు ఎత్తే పోటీల్లో పాల్గొన్న యువకుడు


వరదకాలనీలో ముగ్గుల పోటీల్లో విజేతకు బహుమతి అందజేస్తున్న నాగేంద్రప్రసాద్

కడప కార్పొరేషన్ : సంక్రాంతి పండుగ సంబరాలు పాతకడపలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించి, యువతకు అల్లెంగుండు ఎత్తే పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన వారికి మాజీ కార్పొరేటర్ ఇసుకపల్లి చైతన్య ఆధ్వర్యంలో బహుమతులు అందజేశారు స్థానిక పెద్దలు, యువకులు, మహిళలు పాల్గొన్నారు.

వరదకాలనీలో..

సంక్రాంతి సందర్భంగా రామాంజనేయపురం పరిధిలోని వరదకాలనీలో కడప వ్యవసాయ మార్కెట్‌యార్డ్ డైరెక్టర్ నాగేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలతో పాటు ఆటపాటల పోటీలు ఘనంగా నిర్వహించారు. ఇందులో విజేతలకు మంగళవారం రాత్రి బహుమతులు అందజేశారు. ఇందులో మొత్తం 36మంది మహిళలకు చీరలు పంపిణీ చేశారు. అలాగే వైఎస్సార్ క్రికెట్ టోర్నమెంట్ విజేత శ్రీకాంత్ జట్టుకు ట్రోఫీ బహూకరించారు. ఈ కార్యక్రమంలో స్థానికులు అచ్చమ్మ, మౌనిక, సమీర, మీనా, దేవిబాబు, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

తాళ్లపాకలో అన్నమాచార్య సంకీర్తనాలాపన

రాజంపేట : పదకవితాపితామహుడు తాళ్లపాక అన్నమాచార్యుల జన్మస్థలి తాళ్లపాకలోని అన్నమయ్య ధ్యాన మందిరంలో మహిళలు అన్నమాచార్య సంకీర్తనలు ఆలపించారు. ముందుగా అన్నమయ్య విగ్రహానికి పూజలు నిర్వహించారు. బెంగళూరుకు చెందిన అన్నమాచార్య సంకీర్తన సేవా సమితి ఆధ్వర్యంలో సంకీర్తనలు చేపట్టారు. అన్నమయ్యను స్మరించుకుంటూ ప్రతి యేటా అన్నమయ్య సంకీర్తన సేవాసమితి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ప్రతినిధులు తెలిపారు. సాయి లోకేష్, కంబాల శ్రీనివాసులు, సురేష్‌రాజు, షబ్బీర్ అహమ్మద్, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

వ్యాధుల పట్ల ప్రజలను అప్రమత్తం చేయాలి


ఆసుపత్రిలో రికార్డులను పరిశీలిస్తున్న అడిషనల్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఖాదర్‌వల్లి

బద్వేలు అర్బన్ : సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలని అడిషనల్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఖాదర్‌వల్లి పేర్కొన్నారు. మంగళవారం తొట్టిగారిపల్లె పీహెచ్‌సీని ఆకస్మికంగా ఆయన తనిఖీ చేసిన రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించి జాగ్రత్తలు పాటించేలా చూడాలని కోరారు. అలాగే ప్రతి పంచాయతీలో వైద్యశిబిరాలు నిర్వహించి మందులు అందుబాటులో ఉంచుకోవాలని వైద్యాధికారులకు ఆదేశాలిచ్చారు. గ్రామాల్లో పర్యటించి టీబీ, లెప్రసీ, ఇతర దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులను గుర్తించి వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ చేయాలని కోరారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ జోత్స్నస్వర్ణలత, హెల్త్ ఎడ్యుకేటర్ వెంగయ్య, సూపర్‌వైజర్ వెంకటమ్మ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా వీరభద్రస్వామి గ్రామోత్సవం


గ్రామోత్సవంలో అల్లాడుపల్లె వీరభద్ర స్వామి, భద్రకాళి మాత


సిద్ధారెడ్డిపల్లెలో స్వామివారి గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

చాపాడు : సంక్రాంతి పర్వదినం పురస్కరించుకుని కనుమ పార్వేట రోజున అల్లాడుపల్లె శ్రీ వీరభద్ర స్వామి దేవస్థానం సన్నిధిలో గ్రామోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. అల్లాడుపల్లె దేవళాలు వద్ద నుంచి మొదలైన గ్రామోత్సవం కేతవరం, నెర్రవాడ, బద్రిపల్లె, వీవీ కొట్టాలు, విశ్వనాథపురం, లక్ష్మీపేట, వీరభద్రాపురం, అల్లాడుపల్లె గ్రామాల మీదుగా జరిగి అనంతరం అల్లాడుపల్లె దేవళాలులోని వీరభద్రస్వామి సన్నిధిలో ముగిసింది. రెండు రోజుల పాటు జరిగిన ఈ వేడుకల్లో ఆయా గ్రామ ప్రజల బాణా సంచా కాల్చుతూ వాయిద్యాల నడుమ వీరభద్రస్వామి, భద్రకాళిమాత ఉత్సవ విగ్రహ మూర్తులతో గ్రామోత్సవం నిర్వహించారు.

చెన్నకేశవ స్వామి గ్రామోత్సవం

సంక్రాంతి పండుగ పురస్కరించుకుని మండలంలోని చియ్యపాడు గ్రామంలో మొదలైన లక్ష్మీ చెన్నకేశవ స్వామి గ్రామోత్సవం మంగళవారం తెల్లవారుజామున 3 గంటలకు సిద్ధారెడ్డిపల్లె గ్రామానికి చేరుకుంది. ప్రాచీన కాలం నాటి చెన్నకేశవ స్వామి దేవాలయం వద్ద సంక్రాంతి, కనుమ, పార్వేట ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద నుంచి శ్రీదేవి భూదేవి లక్ష్మీ చెన్నకేశవ స్వామి ఉత్సవ విగ్రహ మూర్తులతో గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయ చైర్మన్ నిరంజన్‌రెడ్డి, గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

ఖాతాదారుల ఆర్థిక స్థోమత పెంచాలన్నదే ఏపీజీబీ లక్ష్యం

వీరపునాయునిపల్లె : ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకులోని ఖాతాదారులందరి ఆర్థిక స్తోమత పెంచుకోవాలన్నదే ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ లక్ష్యమని ఆ శాఖ జనరల్ మేనేజర్ జగదీశ్వర్‌రావు అన్నారు. మంగళవారం ఆయన మండల కేంద్రంలోని బ్యాంకులో ఖాతా దారులతో సమావేశమై మాట్లాడారు. ప్రతి ఒక్కరూ పొదుపును అలవాటు చేసుకోవాలని, ఖాతాదారులు తమ వద్ద ఉన్న మొత్తాన్ని డిపాజిట్ లేదా సేవింగ్ అకౌంటులో జమ చేసుకోవడం వలన అత్యవసరాలకు ఉపయోగపడుతుందన్నారు. ఫిక్స్‌డ్ డిపాజిట్లపై అన్ని బ్యాంకుల కంటే ఎక్కువ వడ్డీ అందించడంతో పాటు తక్కువ వడ్డీతో వివిధ రకాల రుణాలు అందిస్తామన్నారు. డ్వాక్రా మహిళలు తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించి రుణ సహాయాన్ని పెంచుకోవాలన్నారు. రీజనల్ మేనేజర్ శ్రీదేవి మాట్లాడుతూ రికరింగ్ డిపాజిట్ పథకంలో ప్రతి నెల 1350 రూపాయలు చెల్లించి 5 సంవత్సరాలకు లక్ష రూపాయలు పొందవచ్చన్నారు. మండల అధ్యక్షుడు రఘునాథరెడ్డి మాట్లాడుతూ వీరపునాయునిపల్లె శాఖలో లాకర్, ఏటీఎం సౌకర్యం వెంటనే కల్పించాలని కోరారు. గతంలో ఉన్న బ్యాంకుకు సంబంధించిన భవనం సిథిలావస్థకు చేరుకోడవంతో ప్రస్తుతం ప్రైవేటు భవనంలో కొనసాగుతోందని తెలిపారు. అక్కడ నూతనం భవనం నిర్మించకపోతే కోట్ల రూపాయల విలువగల స్థలం ఆక్రమణలకు గురవుతోందన్నారు. దీనిపై స్పందించిన జనరల్ మేనేజర్ ఇప్పటికే భవనాన్ని నిర్మించేందుకు చర్యలు చేపట్టడం జరుగుతోందని నూతన భవనం నిర్మాణం పూర్తి కాగానే లాకర్, ఏటీఎం సౌకర్యాలను ఖాతాదారులకు అందుబాటులోకి తీసుకువస్తామని హామీ ఇచ్చారు. అనంతరం డిపాజిట్ దారులకు బాండు పత్రాలను అందజేశారు. కడప ప్రధాన కార్యాలయ సీనియర్ మేనేజర్ చిరంజీవి, స్థానిక బ్యాంకు మేనేజర్ రవికుమార్, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

జీవిత పరమార్థాన్ని తెలిపేదే భగవద్గీత

జమ్మలమడుగు : మనిషి జీవిత పరమార్థాన్ని వివరించేది భగవద్గీత అని చిన్మయ మిషన్ బ్రహ్మచారిణి రచనా చైతన్య అన్నారు. మంగళవారం పట్టణంలోని బెల్లంకొండు సీతారామ కల్యాణ మండపంలో ప్రవచనాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భగవద్గీతలోని 12వ అధ్యాయంలోని భక్తియోగంలోని పలు అంశాలను వివరించారు. ప్రజలకు ధైర్యాన్ని విలువల గురించి వివరించేది భగవద్గీత అన్నారు. ప్రతి ఒక్కరూ భగవద్గీత చదవాలన్నారు.

ప్రతిపాదిత విద్యుత్ ధరలపై అభ్యంతరాలను తెలపండి

మైదుకూరు: రానున్న ఆర్థిక సంవత్సరానికి ప్రతిపాదించిన వార్షిక ఆదాయ అవసరాలు, రీటైల్ ధరలపై ప్రజల అభ్యంతరాలు, అభిప్రాయాలను తెలియజేయాలని విద్యుత్ శాఖ మైదుకూరు ఈఈ జీవీ రామిరెడ్డి ఒక ప్రకటనలో కోరారు. మైదుకూరు విద్యుత్ డివిజన్ కార్యాలయంలో ఈనెల 19 నుంచి 21వ తేదీ వరకు రోజూ 2023–24 ఆర్థిక సంవత్సరపు ప్రతిపాదిత ఆదాయ అవసరాలు, రీటైల్ ధరలపై వీడియో కాన్ఫరెన్స్‌లో ప్రజలు సలహాలు, అభ్యంతరాలను తెలియజేయాలని ఈఈ తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి 1 గంట వరకు, తిరిగి 2 నుంచి 4.30 గంటల వరకు ప్రజాభిప్రాయ సేకరణ జరుగుతుందని పేర్కొన్నారు. మైదుకూరు, బద్వేలు నియోజకవర్గాల్లోని మండలాల ప్రజలు పాల్గొనాలని కోరారు.

• అ'పూర్వ' కలయిక


ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

బద్వేలు అర్బన్ : మూడు దశాబ్దాలకు పైబడిన అనుబంధం వారిది. ఎప్పుడో చిన్నప్పుడు కలిసి చదువుకుని వివిధ రంగాల్లో స్థిరపడిన స్నేహితులంతా కలుసుకుని తమ జ్ఞాపకాలను పంచుకోవాలనుకున్నారు. స్థానిక నెల్లూరు రోడ్డులోని సాధన ఇంగ్లిషు మీడియం స్కూల్ ఆవరణలో జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల 1983–84 ఎస్ఎస్‌సీ బ్యాచ్ పూర్వ విద్యార్థులు కలుసుకుని ఉల్లాసంగా గడిపారు. అలాగే తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను సన్మానించుకున్నారు. ఫ్రెండ్స్ సేవా సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు లాయం యోగయ్య, గంగసానిసాంబశివారెడ్డి, కోశాధికారి సముద్రాల శ్రీనివాసులు, ఉపాధ్యక్షులు సి.వి.సుబ్బారెడ్డి, కె.శ్రీనివాసులు, గౌరవ సలహాదారులు ఆనంద్‌రెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, ఆదనపు ప్రధాన కార్యదర్శి చిన్నిసుబ్బరాయుడు పాల్గొన్నారు.